క్లుప్తంగా

వాహనాలకు ఫిట్‌నెస్ పరీక్షలు

పార్వతీపురం రూరల్: పార్వతీపురం, సాలూరు, పాలకొండ ప్రాంతాలకు సంబంధించిన రవాణా వాహనాల ఫిట్‌నెస్ పరీక్షలను సీతానగరం మండలం చినభోగిలిలో గల ఆటోమేటెడ్ ఫిట్‌నెస్ సెంటర్‌లో మాత్రమే చేయనున్నట్లు జిల్లా రవాణా అధికారి టి.దుర్గాప్రసాద్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన తన కార్యాలయంలో మాట్లాడుతూ జిల్లాలోని వాహన యజమానులందరూ ఈ విషయాన్ని గమనించి వాహనాల ఫిట్‌నెస్ పరీక్షలు చేసేందుకు చినభోగిలిలోని ఫిట్‌నెస్ సెంటర్‌ను సంప్రదించాలని సూచించారు.

వార్షిక రుణ ప్రణాళికపై శిక్షణ



శిక్షణకు హాజరైన సీసీలు, వీఓఏలు, పొదుపు సంఘాల సభ్యులు

పార్వతీపురం రూరల్: పొదుపు సంఘాల జీవన ప్రమాణాలను, ఉపాధి మెరుగు పరుచుకునేలా ప్రణాళికలు తయారు చేయాలని వెలుగు ఏపీఎం బి.సన్నిబాబు పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం పార్వతీపురం వెలుగు కార్యాలయంలో వార్షిక రుణ ప్రణాళికపై శిక్షణ నిర్వహించారు. 2025-26 జీవనోపాధి కోసం యాప్‌లో ఏవిధంగా వివరాలు నమోదు చేయాలో ఈ శిక్షణలో సూచించారు. మహిళలను ఆర్థికంగా మెరుగు పరిచేందుకు ప్రభుత్వం ఈ కార్యాచరణ రూపొందించిందని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ శిక్షణలో సీసీలతో పాటు వీఓఏలు, సంఘం సభ్యులు తదితరులు ఉన్నారు.

సారా తాగడంతో వచ్చే అనర్థాలు తెలుసుకోవాలి



సారా నిర్మూలన ర్యాలీ చేస్తున్న దృశ్యం

సీతానగరం: సారా తాగడం వల్ల కలిగే అనర్థాలపై ప్రజలు అవగాహన కల్పించుకోవాలని, సారాను తాగవద్దని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీతానగరం సీఐ పద్మావతి అన్నారు. ఈ మేరకు మండలకేంద్రంలో ఎక్సైజ్ శాఖ ఉన్నతాధికారుల సూచనల మేరకు సారా తాగడం వల్ల కలిగే అనర్థాలను వివరిస్తూ ర్యాలీలు, అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ మేరకు సీఐ పద్మావతి మాట్లాడుతూ గ్రామాల్లో సారా నిర్మూలనే లక్ష్యంగా యూత్, మహిళాసంఘాల సభ్యులు ప్రజలను చైతన్య పర్చాలని కోరారు. కార్యక్రమంలో ఎస్సైలు ,సిబ్బంది, యూత్‌సభ్యులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు ప్రారంభం



నూతన ఆర్టీసీ బస్సును ప్రారంభిస్తున్న మంత్రి సంధ్యారాణి

సాలూరు: పట్టణంలోని ఆర్టీసీ డిపో వద్ద నూతన బస్సును మంత్రి సంధ్యారాణి ప్రారంభించారు. ప్రజలు సుఖంగా ప్రయాణించాలని ప్రభుత్వం కోరుకుంటోందని ఈ సందర్భంగా ఆమె అన్నారు. కార్యక్రమంలో డిపోమేనేజర్ సూర్యనారాయణమూర్తి, ఆర్టీసీ అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

పింఛన్లు పంపిణీ చేసిన మంత్రి

మున్సిపాలిటీలోని 23వ వార్డులో మంగళవారం నిర్వహించిన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో స్త్రీశిశుసంక్షేమం, గిరిజన సంక్షేమ శాఖమంత్రి గుమ్మడి సంధ్యారాణి పాల్గొని లబ్ధిదారులకు పింఛన్ సొమ్ము అందించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఇన్‌చార్జ్ కమిషనర్ ప్రసాద్, అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

కార్యాలయం మారినా.. మారని బోర్డు



నర్సిపురం సచివాలయ భవనానికి జిల్లా పంచాయతీ అధికారి వారి కార్యాలయం బోర్డు

పార్వతీపురం రూరల్: జిల్లా ఏర్పాటైన అనంతరం జిల్లా పంచాయతీ అధికారి కార్యాలయాన్ని జిల్లా కేంద్రానికి సమీపంలో ఉన్న నర్సిపురం గ్రామ సచివాలయంలో ఏర్పాటు చేశారు. మూడు సంవత్సరాల అనంతరం ఈ కార్యాలయాన్ని జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదురుగా ఉన్న ప్రభుత్వ కార్యాలయాల సముదాయాల వద్ద ఏర్పాటు చేశారు. ఇదిలా ఉంటే నర్సిపురం సచివాలయానికి ఏర్పాటు చేసిన జిల్లా పంచాయతీ అధికారి వారి కార్యాలయం బోర్డును మాత్రం సచివాలయ భవనానికే అధికారులు విడిచిపెట్టారు. నేటికీ బోర్డును తీయకపోవడంతో జిల్లా పంచాయతీ కార్యాలయం నిర్వహణ ఎక్కడ అనే సందేహం ప్రజలకు కలుగుతోంది.

అలుపెరుగని బాటసారులు..!

- మూగజీవాల మేత కోసం వలసబాట
- పండగలు, పబ్బాలకు నోచుకోని గొర్రెల కాపరులు
- జీవితంలో సింహభాగం వాటి పోషణకే అంకితం
- గ్రాసం కోసం ఇతరప్రాంతాలకు పయనం
- నెలల పాటు కుటుంబాలకు దూరం
- అనారోగ్యాలతో సతమతం



గ్రాసం కోసం గొర్రెలను తీసుకువెళ్లిన కాపరులు

బలిజిపేట: చంకలో సంచి..చేతిలో కర్ర..నెత్తిన తువ్వాలు.. ఎండనక..వాననక..రాయనక రప్పనక..మూగజీవాల వెంట పయనం..కొడలు, గుట్టలు, తుప్పలు, డొంకల్లో సంచారం. మధ్యాహ్నం ఎర్రటి ఎండలో చెట్టుకింద కాసేపు సేదదీరి తిరిగి సాయంత్రం చెట్టు, పుట్ట చాటుకో చేరడం. ఇవీ గొర్రెల కాపరులు నిత్యం పడుతున్న ఇబ్బందులు. స్థానికంగా మూగజీవాల పోషణకు సరిపడా గ్రాసం, వాటిని మేపేందుకు బీడు భూములు లేకపోవడంతో గొర్రెల కాపరులు అష్టకష్టాలు పడుతుంటారు. వారిది అలుపెరగని పయనం. పొద్దు పొడిచింది మొదలు పొద్దు గుంకేవరకు కాళ్లరిగేలా తిరుగుతుంటారు. నెలల తరబడి కుటుంబాలకు దూరంగా ఉంటారు. పండగల రోజుల్లోనూ కుటుంబాలకు దూరమే. జీవాల గ్రాసానికి వారి ప్రయాణంలో రాళ్లు, గుట్టలు, ముళ్లపొదలు, ఎదురైనా జీవాల పోషణే లక్ష్యంగా సాగుతారు. రాత్రి, పగలు తేడాలేకుండా వాటిని కాపలాకాస్తారు. జీవితంలో సింహభాగం వాటి పోషణకే కేటాయిస్తారు. పార్వతీపురం మన్యం జిల్లాలో 10లక్షల జీవాలు(గొర్రెలు, మేకలు) ఉన్నాయి. వాటిపై ఆధారపడి వేల కుటుంబాలు జీవిస్తున్నాయి. ప్రతి కుటుంబంలోని ఒక వ్యక్తి తమ జీవితాన్ని వాటి పెంపకానికి అంకితం చేస్తారు. పది సంవత్సరాల పిల్లలు గొర్రెల మందలను మేపేందుకు వెళ్తుంటారు. ఎండ, వానల కాలంలోనూ జీవాలపై దృష్టిసారించే ఉంటారు. తమ బంధువుల్లో ఎవరికైనా ఏమైనా అయితే వారిని చూసేందుకు వీరు వెళ్లే అవకాశాలు లేకపోవడంతో ఆడవారిని అక్కడికి పంపిస్తారు.

కాళ్ల నొప్పులు:

గొర్రెల కాపరులు రోజంతా నడుస్తుండడంతో కాళ్ల నొప్పులు వారికి త్వరగా వస్తాయని చెబుతున్నారు. చిన్న వయస్సు నుంచి నడకతో గడిపేవారికి వయస్సు మళ్లిన తరువాత కాళ్ల నొప్పుల బారిన పడుతున్నారు.

రోడ్డు ప్రమాదాల్లో మృత్యువాత

గొర్రెలు, మేకలను రోడ్డుపై మేతకు తోలేటప్పుడు భారీ వాహనాలు వాటిని ఢీకొట్టడంతో ప్రమాదాలు జరిగి మూగజీవాలు మృత్యువాత పడుతుంటాయి. ఆ సమయంలో ఆ కాపరుల ఆవేదన అంతా ఇంతా కాదు. అలాగే వర్షాకాలంలో కూడా పిడుగులు పడి మేకలు, గొర్రెలు మరణిస్తాయి. ఇటువంటి క్లిష్ట పరిస్థితుల్లోనూ గొర్రెల కాపరులు మూగజీవాల పొట్ట నింపేందుకు అలుపెరుగని ప్రయాణం చేస్తుంటారు.

షెడ్లు నిర్మించాలి:

ఊరికి సమీపంలో షెడ్లు నిర్మిస్తే బాగుంటుంది. మందలను ఆచేటప్పుడు షెడ్లలో ఉండేందుకు వీలుగా ఉంటుంది. మందల వద్దే జీవాలకు వ్యాక్సిన్ వేసే సదుపాయం కల్పించాలి. టెంట్లు, వలలు ఇస్తే బాగుంటుంది. 40సంవత్సరాలకు పింఛన్ సదుపాయం కల్పిస్తే బాగుంటుంది. వలసపోయేటప్పుడు వాహనాల సదుపాయం కల్పించాలి.

– కె.సత్యనారాయణ, గొర్రెలకాపరి, నారాయణపురం

కుటుంబాలకు దూరంగా	కునుకుతీయకుండా కాపలా..
జీవాల మేతకు కాపరులు ఇతర ప్రాంతాలకు వెళ్తుంటారు. అలాంటి సమయంలో సొంత ఊరు, ఇంటికి కొన్ని నెలలు దూరంగా ఉంటారు. పొలాల్లో మందలను ఉంచి యజమానులు ఇచ్చే పోషకాలతో తిండి తింటారు. కొంతమంది అక్కడే వంటలు వండుకుంటారు.	ఊళ్లకు దూరంగా మందలు నిలపడం వల్ల గతంలో గొర్రెలు, మేకలను దొంగలు ఎత్తుకుపోయేవారు. దీంతో రాత్రి సమయంలో కంటిమీద కునుకులేకుండా కాపలాకాయాల్సి వచ్చేది. ప్రస్తుతం పొలాల్లో మందలు వేస్తుండడంతో పాములు, క్రూర జంతువుల భయంతో కాపలాకాయాల్సి వస్తోంది. పగలు కాళ్లరిగేలా తిరిగి రాత్రి నిద్రలేక వారి అవస్థలు వర్ణనాతీతంగా ఉన్నాయి.

భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు నిర్వహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న సంఘం కార్యదర్శి సత్యనారాయణ

బలిజిపేట: భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును సమర్థవంతంగా నిర్వహించి, కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని బలిజిపేట మండల భవన నిర్మాణ కార్మికుల సంఘం కార్యదర్శి సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఈ మేరకు బలిజిపేటలోని సీఐటీయూ కార్యాలయంలో భవన నిర్మాణకార్మికుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు సుబ్బారావు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ అసలైన భవన నిర్మాణ కార్మికులకు పెన్షన్ సౌకర్యం కల్పించాలని, పెండింగ్ క్లెయిమ్‌లు పరిష్కరించాలని, సంక్షేమ బోర్డులో నమోదుచేసుకున్న కార్మికులకు ఈ శ్రమ పోర్టల్‌లో నమోదుచేసుకున్న కార్మికులకు విశ్వకర్మ యోజన అమలు చేయాలన్న డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధానకార్యదర్శి మన్మథరావు, కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

జీతాలు చెల్లించలేని దుస్థితిలో మున్సిపాలిటీ



నిరసన తెలియచేస్తున్న నాయకులు, కార్మికులు

సాలూరు: మున్సిపాలిటీలో కార్మికులు, ఉద్యోగులకు నేటికీ జీతాలు ఇవ్వలేని దుస్థితి నెలకొందని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ సాలూరు కమిటీ నాయకులు వాపోయారు. అధికారులు, పాలకవర్గం నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ రాష్ట్రవ్యాప్త నిరసనలో భాగంగా మంగళవారం మున్సిపల్ కార్యాలయం వద్ద తమ నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, మున్సిపల్ కమిషనర్‌ను ఇటీవల సరెండర్ చేసిన నేపథ్యంలో ఎఫ్ఏసీ ఎవరికీ ఇవ్వకపోవడంతో జీతాలు పెట్టని పరిస్థితి నెలకొందని వాపోయారు. రాష్ట్రంలో కాంట్రాక్ట్ కార్మికులకు రక్షణగా ఉన్న ఆప్కాస్‌ను రద్దు చేసినప్పుడు, కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు అందరినీ పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. మున్సిపాలిటీలో రెగ్యులర్ కమిషనర్ లేక పాలన అస్తవ్యస్తంగా మారిందని, అయినా స్థానిక మంత్రి, కలెక్టర్ ఎందుకు మున్సిపాలిటీపై దృష్టిసారించడం లేదని ప్రశ్నించారు.

ఇదే పరిస్థితి కొనసాగితే పండగ ముందు సమ్మెకు కూడా వెనుకాడమని పునరుద్ఘాటించారు.కార్యక్రమంలో నాయకులు, కార్మికులు రాముడు, శంకర్రావు, శ్రీను, రవి, పోలరాజు, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో వ్యాధుల లక్షణాలు గుర్తించాలి

- వైద్యారోగ్య శాఖ ప్రోగ్రాం అధికారి డా. టి.జగన్‌మోహన్‌రావు



రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ప్రోగ్రాం అధికారి డా. టి. జగన్‌మోహన్‌రావు

పార్వతీపురం రూరల్: గ్రామీణ ప్రాంతాల్లో ఆరోగ్య కేంద్రాల ద్వారా అన్ని వైద్య సదుపాయాలను ప్రజలకు పూర్తిస్థాయిలో అందజేయాలని వైద్యులు, సిబ్బంది ఆ ప్రాంతాల్లో వ్యాధుల లక్షణాలను సకాలంలో గుర్తించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ప్రోగ్రాం అధికారి డా. టి. జగన్‌మోహన్‌రావు అన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన మండలంలోని పుట్టూరు, చినబొండపల్లి గ్రామాలకు ఆకస్మికంగా వెళ్లి పరిశీలించారు. ఆ ప్రాంతాల్లో అందుతున్న వైద్య సేవలపై పర్యవేక్షణ చేశారు. ఆరోగ్య సర్వేల ద్వారా వ్యాధి లక్షణాల తీరును పరిశీలించి, ఎన్‌సీడీ సర్వే ఏ మేరకు పూర్తి చేశారో యాప్‌లో పరిశీలించారు. ప్రజలకు నిర్వహిస్తున్న పరీక్షలు, చికిత్సలకు సంబంధించిన రికార్డులను తీసి పరిశీలించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యురాలు డా.ఐశ్వర్య, యోగీశ్వరరెడ్డి, ఈఓ సత్తిబాబు, సిబ్బంది సౌజన్య, కమల, పద్మ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

నియామకాలు రద్దు చేయాలి



డీఎంహెచ్‌ఓకు వినతిపత్రం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

పార్వతీపురం టౌన్: వైద్యారోగ్యశాఖలో నిబంధనలకు విరుద్ధంగా చేపట్టిన నియామకాల మాటేమిటని కాంగ్రెస్ పార్టీనాయకులు డీఎంహెచ్‌ను భాస్కర రావును ప్రశ్నించారు. ఈ మేరకు కాంగ్రెస్ పార్టీ ఓబీసీ జిల్లా చైర్మన్ వంగల దాలినాయుడు, మండల అధ్యక్షుడు టి. గౌరీశంకరరావు, జిల్లా నాయకులు కోలా కిరణ్ తదితరులు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఎస్.భాస్కరావును మంగళవారం కలిసి పలు మాట్లాడుతూ క్వాలిటీ కన్సల్టెంట్, పబ్లిక్ హెల్త్ కన్సల్టెంట్ ఉద్యోగాలు, నేషనల్ హెల్త్ మిషన్‌లో జాతీయ క్షయ నిర్మూలన కార్యక్రమంలో మెడికల్ అధికారి, జిల్లా ప్రోగ్రాం కోఆర్డినేటర్, డాట్ ప్లస్ సూపర్‌వైజర్, జిల్లా పీపీఎం కోఆర్డినేటర్, అకౌంటెంట్ తదితర ఉద్యోగ నియామకాల విషయంలో పలు ఆరోపణలు ఉన్నాయన్నారు. ఈ నియామకాల్లో ఓ పత్రికా విలేకరి కుమారుడికి, కార్యాలయంలో పనిచేసే అధికారి బంధువుకి, రాజకీయ పలుకుబడి ఉన్న వారికి ఉద్యోగాలు ఇచ్చినట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. తక్షణమే వాటిని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే వేసవి ఎండలు అధికం కావడంతో వేసవి రోగాలైన డయేరియా, జలుబు, దగ్గు, జ్వరాలు ప్రజలను వేధిస్తున్నాయని, గ్రామాల్లో ఫీల్డ్ స్టాఫ్ ప్రజలకు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని కోరారు.

భవిష్యత్ ప్రయాణం ఎటు..?





పదోతరగతి విద్యార్థులు (ఫైల్)

పార్వతీపురం రూరల్:

విద్యార్థి జీవితంలో కీలకమైన పదోతరగతి అనంతరం వారు తీసుకున్న నిర్ణయం పట్ల ఎటువైపు అడుగులు వేయాలన్న ఆలోచనతో వారి ఉజ్వల భవిష్యత్‌కు దోహదం చేసే కోర్సుల గురించి అన్వేషించే కీలక సమయం ఇది. మంగళవారంతో పది పరీక్షలు ముగియడంతో ఏ కోర్సులు అనుకూలమైనవి, వాటితో వచ్చే అవకాశాలేంటి అని వాకబు చేయాలి. పదోతరగతి తరువాత ఉన్న కోర్సులు భవిష్యత్‌లో వాటితో వచ్చే అవకాశాలు ఏమిటన్న కసరత్తు తల్లిదండ్రులు, విద్యార్థులు చేయాలి. వారు ఎంపిక చేసుకున్న మార్గమే ఆ విద్యార్థి కెరీర్‌ను నిర్దేశిస్తుంది. పదోతరగతి తరువాత విద్యార్థులకు ఇంటర్మీడియట్, పాలిటెక్నిక్, ఐటీఐ ఇలా పలు కోర్సులు అందుబాటులో ఉంటాయి. ఇంజినీరింగ్‌లో కెరీర్‌కు బాటలు వేసుకునేందుకు ఇంటర్‌లో ఎంపీసీ గ్రూప్ ఎంచుకోవాల్సి ఉంటుంది. జాతీయస్థాయిలో నిర్వహించే నీట్-యూజీ ర్యాంక్ ఆధారంగా ఎంబీబీఎస్, బీడీఎస్, ఆయుష్ కోర్సుల్లో అడుగుపెట్టేందుకు, అలాగే రాష్ట్రస్థాయిలో ఈఏపీసెట్‌లో ర్యాంకులు సాధించి వెటర్నరీ సైన్స్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో చేరేందుకు ఇంటర్‌లో బైపీసీ గ్రూపును ఎంచుకోవాలి. సీఈసీతో కార్పొరేట్ కెరీర్‌కు చక్కటి మార్గం, కామర్స్, ఎకనామిక్స్, సివిక్స్ సబ్జెక్టులతో ఉండే సీఈసీ గ్రూపును కార్పొరేట్ రంగంలో కెరీర్ కోరుకునే వారు ఎంచుకోవాల్సి ఉంటుంది. సివిక్స్, ఎకనామిక్స్, హిస్టరీ సబ్జెక్టులుగా ఉండే హెచ్ఈసీపై పట్టు సాధించడం ద్వారా సివిల్ సర్వీసెస్, గ్రూప్స్ తదితర ఉన్నత లక్ష్యాలు నిర్దేశించుకున్న వారికి ఈ గ్రూపు అనుకూలంగా నిలుస్తుంది. ప్రస్తుత కాలంలో బీఏలోను పలు జాబ్ ఓరియెంటెడ్ గ్రూపు కాంబినేషన్స్ అందుబాటులో ఉన్నాయి.

పిల్లల నిర్ణయానికి ప్రాముఖ్యం



పిల్లలు తమ ఆసక్తితోపాటు సామర్థ్యాన్ని గుర్తెరిగి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు మార్గనిర్దేశనంలో కోర్సులు ఎంచుకుంటే మంచిది. ప్రపంచీకరణ నేపథ్యంలో విద్యావ్యవస్థలో ఎప్పటికప్పుడు నూతన కోర్సులు ఆవిష్కృతమవుతున్నాయి. ఒక్కో సందర్భంలో వారికే స్వేచ్ఛను ఇచ్చి నిర్ణయం తీసుకోమని అడగాలి. ఒక వేళ పిల్లలకు సామర్థ్యం ఉండి సాధారణ కోర్సుల్లో చేరాలని సంకల్పిస్తే కౌన్సెలింగ్ చేసి మనస్సు మార్చాలి. తాము చేసే కోర్సులపై స్పష్టమైన అవగాహన ఉంటే భవిష్యత్‌లో చిక్కులు ఉండవు.

– పి. జయప్రసాద్, రిటైర్డ్ హెచ్ఎం

మంచి నిర్ణయానికి ప్రాధాన్యం



ఇప్పటి నుంచే విద్యార్థి పక్కా ప్రణాళికతో ముందుకు పోవాల్సిన అవసరం ఉంటుంది. ఇందుకు తల్లిదండ్రుల ప్రోత్సాహం, సహకారం ప్రధానమైనవి. పిల్లల నిర్ణయం మంచిదైతే వారి లక్ష్యాలకు అనుగుణంగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత తల్లిదండ్రులదే. పిల్లలకు ఇష్టం లేకపోతే వారిని ఒత్తిడికి గురిచేయకుండా ఆలోచింపజేసేలా వారితో మాట్లాడాలి. ఇక్కడ నుంచి జరిగే విద్యాప్రయాణంలో ఏ మాత్రం తడబడినా అది కెరీర్‌కు భంగం కలిగిస్తుంది.

– అమరాపు సూర్యనారాయణ, ఉపాధ్యాయుడు

సమయాన్ని వృథా చేయకూడదు



ఫలితాలు వచ్చేలోపు అతి తక్కువ రోజుల్లో కంప్యూటర్ రంగానికి చెందిన శిక్షణ తీసుకుని స్కిల్స్ డెవలప్ చేసుకోవాలి. ఇంగ్లిష్‌పై పట్టు సాధించేందుకు శిక్షణ తీసుకోవాలి. సమయాన్ని వృథా చేయకుండా భవిష్యత్‌లో నిర్ణయించుకున్న స్థానానికి చేరుకోవడానికి ఇప్పటి నుంచే ప్రణాళిక సిద్ధం చేసుకోవాలి. – మేరీ సరోజ, ఉపాధ్యాయురాలు

బుచ్చింపేటలో దాహంకేకలు



సీపీఎం ఆధ్వర్యంలో తాగునీటి సమస్యపై నిరసన వ్యక్తం చేస్తున్న బుచ్చింపేట గ్రామస్తులు

పార్వతీపురం రూరల్: మండలంలోని డోకిశీల పంచాయతీ పరిధి బుచ్చింపేట గిరిజన గ్రామంలో మంచినీరు లేక స్థానిక గిరిజన ప్రజలు అవస్థలు పడుతున్నారంటూ సీపీఎం ఆధ్వర్యంలో మంగళవారం గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు. ఓ పక్క ప్రభుత్వం మరోపక్క అధికారులు తాగునీటి సరఫరాకు ఎన్ని వాగ్దానాలు చేస్తున్నా ప్రజలకు తాగునీరు అందించడంలో ఘోరంగా విఫలమయ్యారని సీపీఎం నాయకులు విమర్శించారు. సుమారు 100 కుటుంబాలు ఉన్న బుచ్చింపేట గ్రామంలో తాగునీటి ఎద్దడి కారణంగా నేలబావులను ఆశ్రయించి కలుషిత నీటిని తాగి గ్రామస్తులు కీళ్లనొప్పులు, వ్యాధుల బారిన పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామంలో ఉన్న మంచినీటి ట్యాంకులు దిష్టిబొమ్మల్లా ఉండడం తప్ప గ్రామస్తుల దాహార్తిని తీర్చేందుకు ఉపయోగపడడం లేదన్నారు. డోకిశీల నుంచి పైప్‌లైన్ ద్వారా తాగునీరు సరఫరా చేయాల్సినప్పటికీ సరిగ్గా ఒక్కరోజు కూడా నీరు అందడం లేదని, ఇప్పటికైనా సంబంధిత అధికారులు తాగునీటి సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

నేడు ఉచిత నేత్రవైద్య శిబిరం

సాలూరు: పట్టణంలోని నవజీవన్ ఆశ్రమంలో బుధవారం ఉచిత మెగా కంటి చికిత్స శిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకురాలు స్వాతిశ్రీ ఓ ప్రకటనలో తెలిపారు. ఐఆర్‌డీఎస్ ఆధ్వర్యంలో విజయనగరం పుష్పగిరి కంటి ఆస్పత్రి సౌజన్యంతో ఈ శిబిరం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కంటి పరీక్షలు చేసి మందులు ఇవ్వనున్నామని, ఆపరేషన్ అవసరమైతే అదే రోజున ఆస్పత్రికి తీసుకువెళ్లి ఆపరేషన్ చేస్తారని పేర్కొన్నారు. ఆధార్, ఆరోగ్యశ్రీకార్డులు తప్పనిసరిగా తీసుకురావాలని సూచించారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి



మాట్లాడుతున్న మండల ఇంజినీరింగ్ అధికారి చంద్రమౌళి

సీతానగరం: మండలంలో ఉపాధిహామీ నిధులతో మంజూరుచేసిన గ్రామీణాభివృద్ధి పనులు వేగవంతం చేయాలని మండల ఇంజినీరింగ్ అధికారి గంటా చంద్రమౌళి అన్నారు. ఈ మేరకు మండలంలోని సుమిత్రాపురం, గుచ్చిమి,సీతానగరం గ్రామాల్లో జరుగుతున్న సీసీ రోడ్లు, కాలువల పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రూ.2కోట్ల 52లక్షల 7 వేలతో 70 పనులు మంజూరుచేసినట్లు తెలియజేశారు. ఎక్కువగా సీసీ రోడ్లు, కాలువలు రిటైనింగ్ గోడలు, కల్వర్టుల నిర్మాణాలకు ప్రాధాన్యం ఇచ్చినట్లు చెప్పారు. రూ. 1.80 కోట్ల విలువైన పనులు పూర్తి కావడంతో బిల్లులు అప్‌లోడ్ చేసినట్లు తెలిపారు. గతప్రభుత్వం హయాంలో జరిగిన పనులకు రూ.40 లక్షలు బిల్లులు చెల్లింపులకు సిద్ధం చేశామన్నారు. మిగతా పనులు వేగవంతం చేయడానికి నిర్వాహకులపై ఒత్తిడి తెచ్చినట్లు చెప్పారు.

వేతనదారులు జాగ్రత్తలు పాటించాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ పి.త్రివిక్రమరావు

సీతానగరం: ఎండల తీవ్రత కారణంగా వేతనదారులు వడదెబ్బకు గురికాకుండా తగినజాగ్రత్తలు పాటించాలని ఎంపీడీఓ పి.త్రివిక్రమరావు అన్నారు. ఈ మేరకు కోట సీతారాం పురం గ్రామంలో ఉపాధిహామీ పథకం ద్వారా వలసచెరువులో వేతనదారులు చేస్తున్న పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నాలుగు రోజులుగా ఉష్ణోగ్రతలు పెరుగుతున్నందున వేతనదారులు వడదెబ్బ బారిన పడే ప్రమాదముందన్నారు. వడదెబ్బకు గురికాకుండా ఉండేందుకు వేతనదారులు చల్లనీరు అందుబాటులో ఉంచుకోవాలని, తలకు పాగా, కాళ్లకు చెప్పులు విధిగా ధరించాలని సూచించారు. అలాగే గ్రామాల్లో ఉపాధి పనుల ప్రాధాన్యాన్ని బట్టి వేతనదారులందరికీ పనులు కల్పించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టెక్నికల్ సహాయకులు, క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు.

ఆజూరులో రేషన్‌డిపో ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న నాయకులు

పాచిపెంట: మండలంలోని ఆజూరు గిరిజన గ్రామం వద్ద రేషన్‌డిపో ఏర్పాటు చేయాలని ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు మర్రి చినబాబు, పాముల సన్యాసిరావు, సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కోరాడ ఈశ్వరరావులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో గ్రామంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఈశ్వరరావు మాట్లాడుతూ, ఇక్కడ రేషన్‌డిపో లేకపోవడం వల్ల ఆజూరు, కుంబివలస, కొండంగిపాడు గిరిజన గ్రామాల నుంచి దాదాపు 5 నుంచి 6 కిలోమీటర్ల వరకు పద్మాపురం పంచాయతీ రొడ్డవలస గ్రామానికి వెళ్లి రేషన్ సరుకులు తీసుకురావడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.దీనిపై ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించి ఆజూరులో డిపో ఏర్పాటుచేయాలని కోరారు. లేకుంటే భవిష్యత్‌లో పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు, గిరిజనులు పాల్గొన్నారు.